ప్రజాశక్తి
సోమవారం 12 డిసెంబర్ 2022 5 అనంతపురం



ఎసిబి వలలో..'వివాదాల రాము'



- రూ.25 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సిఐ
- ఆది నుంచి ఆయన తీరు వివాదాస్పదమే
- గతంలోనే అనేక ఫిర్యాదులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లా పోలీసు శాఖలో వివాదాల రాముగా పేరొందిన బుక్కరాయసముద్రం సిఐ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) వలలో చిక్కాడు. బెయిల్ మంజూరు కోసం రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సిఐ రాముతోపాటు కానిస్టేబుల్ కరీమ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు చేసి కర్నూలులోని ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ శివనారాయణ తెలిపిన సమాచారం మేరకు నెల్లూరుకు చెందిన మల్లికార్జున అనే వ్యక్తి బుక్కరాయసముద్రం మండల పరిధిలో కొండారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన సర్వే నెంబరు 611-1 భూమిని లీజుకు తీసుకుని డీఎడ్ కళాశాల నడుపుతుండేవాడు. భూ యజమాని కొండారెడ్డి డబ్బులు తీసుకుని తనకు మోసం చేశాడని 2021లో మల్లికార్జున ఫిర్యాదు చేయగా ఛీటింగ్ కేసు పెట్టారు. ఇందులో కొండారెడ్డి జైలుకెళ్లి వచ్చిన తరువాత మల్లికార్జున ఆయన భార్య, తమ్ముడులు మోసం చేసారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మల్లికార్జునను బికెస్ పోలీసులు అరెస్టు చేశారు. అతని భార్య, తమ్ముడు అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరు హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. దీన్ని పరిగణలోకి తీసుకుని బెయిల్ ఇవ్వాలంటే రూ.75 వేలు లంచమివ్వాలని సిఐ రాము డిమాండ్ చేశారు. మొదట రూ.50 వేలు డబ్బులిచ్చారు. తక్కిన రూ.25 వేలు లంచమిస్తేనే బెయిల్ ఇస్తామని లేకపోతే, బెయిల్ పేపర్లు చింపేసి, విచారణకు సహకరించలేదని కోర్టులో పిటీషన్ వేస్తానని రాము బెదిరించాడు. దీంతో భార్య, తమ్ముడులు యాప్‌లో అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎసిబి అధికారులు శుక్రవారం రాత్రి పోలీసు స్టేషన్ వద్ద లంచం తీసుకుంటూ ఉండగా ఎసిబి అధికారులు కాపు కాచి సిఐ రాముతో పాటు కానిస్టేబుల్ కరీంను పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కర్నూలు ఎసిబి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎసిబి డీఎస్పీ శివనారాయణ తెలిపారు.

వివాదాల రాము

బుక్కరాయసముద్రం సిఐ రాము గతంలోనే ఒకసారి వివాదాస్పదమయ్యారు. ఒక సమావేశంలో గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డిని సింహంతో, ఇతరులను గొర్రెలతో పోల్చిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఆ తరువాత ఒక టీ కొట్టు నిర్వాహకుడిని కొట్టడం కూడా వివాదాస్పదమైంది. ఈ క్రమంలో ఆయన్ను అక్కడి నుంచి తప్పించారు. తాజాగా బుక్కరాయసముద్రం సిఐగా వచ్చారు. ఇక్కడి కూడా అనేక వివాదాలు, ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. పైసల్లేనిదే ఆ పోలీసు స్టేషన్‌లో పని జరగదన్న ఆరోపణలు ఇటీవల అధికం అయ్యాయి. సాధారణమైన వాటికి కూడా పైసలిస్తేనే పని జరుగతుందని, లేకపోతే ఇబ్బందులు తప్పవన్న ఆరోపణలున్నాయి. తాజాగా ఇప్పుడు పట్టుబడిన కేసులోనూ న్యాయస్థానం ఇచ్చిన బెయిల్‌ను అనుమతించేందుకు కూడా రూ.75 వేలు డిమాండ్ చేశారంటే ఆ పోలీసు స్టేషన్‌లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే తరహా మరో ఘటనలోనూ డబ్బులు ఇవ్వనందుకు సిఐ రాము పని జరగనివ్వకుండా అడ్డు వేసారన్న ఆరోపణ లున్నాయి.



ఎసిబికి చిక్కిన సిఐ రాము

లోక్‌అదాలత్‌లో పరిష్కారమైనా... వదలని వాహనం

2020లో బుక్కరాయ సముద్రం పరిధిలో ఓ వాహనంకు సంబంధించి కేసు నమోదయ్యింది. బొలేరో వాహనం, స్కూటర్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఈకేసు ఇటీవల జరిగిన మెగా లోక్ అదాలత్‌లో పరిష్కారమైంది. పరిష్కారమైన పత్రాలను తీసుకుని వచ్చి స్టేషన్‌లో ఉన్న వాహనాన్ని తీసుకెళ్లేందుకు వాహన యజమాని వెళ్లాడు. అయితే ఇప్పటికీ ఆ వాహనంను బికెఎస్ పోలీసులు ఆ యజమానికి ఇవ్వలేదు. కొంత మొత్తాన్ని సదరు యజమాని ముట్టజెప్పినా ఆ అధికారి సంతృప్తి కలగలేదు. దీంతో వాహనం విడుదల చేయడం వాయిదాలు వేస్తూ వస్తుండటంతో వాహన యజమాని స్టేషన్ చుట్టు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా ఆ పోలీసు స్టేషన్‌లో చిన్నచిన్న కేసుల్లోనూ డబ్బులు ముట్టజెబితేనే పనులు సాగుతాయి... లేకపోతే బాధితులు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

- ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి
- అనంతపురం జిల్లా కార్మిక శాఖ డిసిఎల్ రఘురాములు



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ఫలాలు అందించడమే తమ లక్ష్యమని అనంతపురం జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.రఘురాములు పేర్కొన్నారు. జిల్లాలో కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న సేవలపై ప్రజాశక్తి ముఖాముఖితో ఆయన ముచ్చటించారు.

ప్ర: జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి.? కార్మికుల పరిస్థితి ఎలా ఉంది.?

డిసిఎల్ : జిల్లాలో 500కు పైబడి పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు మూతబడ్డాయి. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా సమస్యలు తలెత్తితే కార్మిక శాఖకు ఫిర్యాదు చేస్తారు. ఆ ఫిర్యాదు మేరకు తమ శాఖ అధికారులు పరిశీలించి సమస్య ఉందని తెలిస్తే సంబంధిత పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తాం. యజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే న్యాయశాఖను ఆశ్రయించి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పని చేస్తాం.

ప్ర: పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారా.?

డిసిఎల్ : జిల్లాలో పలు పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించిన మాట వాస్తవమే. ప్రమాదం సంభవిస్తే సంబంధిత యాజమాన్య నిర్వహణ లోపం, అజాగ్రత్తల వల్లే అని నిరూపణ అయితే బాధిత కార్మికులకు పరిహారం ఇప్పిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వారి కుటుంబాన్ని ఆదుకునే చర్యలూ తీసుకుంటున్నాం. పరిశ్రమల యజమానులు పరిశ్రమ నిర్వహణకు అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే ఏర్పాటు చేస్తున్నారు. భద్రత చర్యలు ఉంటేనే ప్రభుత్వం అనుమతి ఉంటుంది. మధ్యలో ఏదైనా ప్రమాదం ఏర్పడితే యాజమాన్యం బాధ్యత తీసుకోవాలి. బాధితుల పక్షాన తమ శాఖ పని చేస్తుంది.



ప్ర: యాజమాన్యాలు కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నట్లు ఆరోపనలు ఉన్నాయి.. వాస్తవేమేనా.?

డిసిఎల్ : పరిశ్రమలో పనిని బట్టి కార్మికులను నియమిస్తారు. చేరేప్పుడే వేతనం ఎంత ఇస్తారో స్పష్టమైన హామీతోనే చేరుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వారు ఇచ్చే వేతనాలు పెంపుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో అది తూచా తప్పకుండా అమలు అవుతుంది. ప్రయివేటు పరిశ్రమల్లో ఈ పరిస్థితి కొంత ఉండదు. కార్మికుల పనిని బట్టి యజమానులే వేతనాలు నిర్ణయిస్తారు. 10 మంది చేయాల్సిన పనిని 5 మందితో చేయించి ఇబ్బందులు పెడితే తప్పకుండా యాజమాన్యం తప్పే. అలాంటి ఫిర్యాదులు వస్తే పరిశీలన చేసి కార్మిక శాఖ ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్ర: కార్మికులను తొలగిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

డిసిఎల్ : యజమాని పరిశ్రమ మూత వేస్తున్నప్పుడు కార్మికులను తొలగిస్తే ఎవరూ ఏమీ చేయలేరు. పరిశ్రమ నిర్వహిస్తూనే ఎలాంటి తప్పు లేకుండా తొలగించారన్న ఫిర్యాదు చేస్తే పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. కార్మికుల యాజమాన్యం నిబంధనలు అతిక్రమించి ఏదైన పొరపాట్లు చేశారన్న కారణంతో తొలగిస్తే కూడా ఏమి చేయలేం. అలాంటి ఫిర్యాదులను పరిశీలన చేసి కార్మికుల తప్పిదం లేదని తేలితే వారికి అండగా నిలుస్తున్నాం.

ప్ర: కార్మిక శాఖ యాజమానులకు అనుకూలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. ఇది వాస్తవేమేనా.?

డిసిఎల్ : జిల్లాలో కొత్త పరిశ్రమలు రావాలి. అప్పుడే కొత్తగా కార్మికులకు పని లభిస్తుంది. పరిశ్రమలను ప్రభుత్వమే స్వాగతిస్తోంది. సరళీకరణ విధానం కార్మిక చట్టాల్లో కూడా జరిగింది. ప్రభుత్వ పాలకులు, చేసిన చట్టాలను అధికారులుగా తాము అమలు చేయాల్సిందే. వ్యాపారం అభివృద్ధి జరిగినప్పుడే కొత్త పరిశ్రమలు వస్తాయి. యజమానులకు తమ శాఖ ద్వారా ఇవ్వాల్సిన అన్ని అనుమతులు ఇస్తాం. అంత మాత్రాన యజమానులకు అనుకూలంగా పని చేసినట్టు కాదు కదా. విరివిగా ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. చిన్న చిన్న పొరపాట్లు యాజమాన్యం చేస్తే సరి చేసి సక్రమంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్ర: కార్మికుల సంక్షేమం అమలు జరుగుతోందా.?

డిసిఎల్ : భవన నిర్మాణ రంగం కార్మికులకు శాఖ తరుపున వివాహ ప్రోత్సహకాలు, ప్రసూతి సహాయం, ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా తదితరాలు ఇస్తాం. సాధారణ మృతికి రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు జరిగితే రూ.2 లక్షలు, అంగవైకల్యంకు రూ.2 లక్షలు ఇలా ఇస్తున్నాం. కార్మికశాఖ నుంచి ఇచ్చే ప్రోత్సాహకాల కంటే రాష్ట్ర ప్రభుత్వం ఆయా కులాల వారీగా ఇస్తున్న సదుపాయాలు ఎక్కువగా ఉంది. లబ్ధిదారుడు ఎక్కడో ఒక శాఖ ద్వారా మాత్రమే తీసుకోవాలి. కార్మిక శాఖ కంటే విద్యా, వైద్యం, ప్రమాద బీమ రంగాల నుంచి అధిక ప్రోత్సాహం ఇస్తున్నప్పుడు అక్కడే తీసుకుంటుంన్నారు. మా శాఖ తరుపున ఇవ్వాల్సిన ఇతర శాఖలకు బదలాయింపులు చేశారు. అనుమతులు కూడా ఆన్‌లైన్ మీసేవా ద్వారా పొందుతున్నారు. గతంలో అనేక పర్యవేక్షణ తమ శాఖ పరిధిలో ఉండేది అనేక మార్పులు జరిగిన తరువాత ఇతర శాఖలకు కొన్ని బాధ్యతలు అప్పగించారు. చిన్న షాపులు, సంస్థలు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని నిర్వహించుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. వాటిని అందరూ పాటించాల్సిందే.

జిల్లా రాజకీయాల్లో తాడిపత్రి నియోజకవర్గం ప్రత్యేకం

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

జిల్లా రాజకీయాలలో తాడిపత్రి నియోజకవర్గం ప్రత్యేకమని, కార్యకర్తలందరూ ఐకమత్యంతో మరొకమారు రానున్న అసెంబ్లీ ఎన్నికలలో వైసిపి జెండా ఎగరవేసేందుకు కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైసిపి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధ్యక్షతన స్థానిక మార్కెట్ యార్డ్ నందు నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంత్రివర్యులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కష్టపడ్డారన్నారు. జెండా ఎగురవేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైసిపి జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు జగనన్న మనకు ఇచ్చిన బాణాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏ కార్యక్రమం చేపట్టినా అందరినీ కలుపుకుని పోతారని అతనికి తాను కూడా అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి మాట్లాడుతూ నాడు జగన్ ప్రభంజనంతో ప్రజలు ఆదేశించారని, నేడు జగన్ సంక్షేమ పథకాలతో ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ప్రతి గ్రామంలో కక్షలు ఉండేవని ప్రస్తుతం నియోజకవర్గం ప్రశాంతంగా ఉందన్నారు. తాడిపత్రి ప్రాంతానికి పోలీసు అధికారులు డూటీ నిమిత్తం రావాలంటే ఆసక్తి చూపేవారు కాదన్నారు. నేడు పోలీసు స్టేషన్‌కి సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు స్వతంత్రంగా వచ్చి పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరిస్తుంటే జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం రాకపోయి ఉంటే తాడిపత్రిలో జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం మరుగున పడివుండేదని చెప్పారు. బిసి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలు చాలా ఆనందంగా ఉన్నారని, తలెత్తుకుని బతుకుతున్నామని పేర్కొన్నారు. పేదరికంలో ముగ్గుతున్న ముస్లిం సోదరులకు నాలుగు శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత వైఎస్‌ఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ముస్లిములకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పోస్టర్లు విడుదల చేస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

17,18న మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 17,18వ తేదీల్లో మానవ హక్కుల వేదిక 9వ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన గొడపత్రికలను ఆదివారం అనంతపురం నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ రసూల్, సుబ్బన్న మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిజామాబాద్ జిల్లాలో మహాసభలు జరుగుతాయన్నారు. 'ప్రజాస్వామ్యంపై హిందుత్వ దాడి', భూమి సమస్యలు-ప్రజా హక్కులు', ఆదివాసీల సంస్కృతి-విధ్వంసం' అనే మూడు అంశాలపై ఉపన్యాసాలు, చర్చలు ఉంటాయని తెలిపారు. మహాసభల్లో ప్రజలు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అఖిల భారత రైతు మహాసభలకు చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో ఈ నెల 13 నుంచి 16వ తేది వరకు నిర్వహిస్తున్న అఖిల భారత కిసాన్ సభ 35వ జాతీయ మహాసభలకు అనంతపురం జిల్లా నుంచి ప్రతినిధిగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్డ్డి ఎన్నిక అయ్యారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. మూడేళ్లకు ఒకసారి అఖిల భారత రైతు సంఘం మహాసభలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ మహాసభల్లో గత ఉద్యమాలను చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారన్నారు. ప్రస్తుతం వ్యవసాయం సంక్షోభంలో ఉందని, రైతాంగం నష్టాల్లో, కష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. దేశంలో రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకువచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం జరిపిన ఉద్యమ ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేశారన్నారు. అయినా వ్యవసాయ కార్పొరేటీకరణ ప్రమాదం పోలేదన్నారు. అందుకే మోడీ ప్రభుత్వం రైతాంగ ఉద్యమ ఫలితంగా ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మద్దతు ధరలు, గ్యారెంటీ చట్టం, రైతు రుణ విమోచన చట్టం తీసుకురాలేదన్నారు. దేశవ్యాప్తంగా మరో రైతు ఉద్యమానికి అఖిల భారత రైతు మహాసభలు దశ దిశ నిర్దేశించనున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగిన చారిత్రాత్మకమైన రైతు ఉద్యమంలో అఖిల భారత కిసాన్ సభ కీలక పాత్ర పోషించిందన్నారు. రైతు రక్షణ, వ్యవసాయ పరిరక్షణ కోసం జరుగుతున్న అఖిల భారత రైతు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సైన్స్, టెక్నాలజీతోనే అభివృద్ధి సాధ్యం

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం కలెక్టరేట్ : సైన్స్, టెక్నాలజితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబంరాలు నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎస్.భాస్కర్ అధ్యక్షతన రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పరీక్షలను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జెవివి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో, సామాన్య ప్రజానికంలో సైన్స్ భావాలను, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందచడం ఆదర్శనీయంగా ఉందన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యక్ష కార్యక్రమాలు, ప్రచారం చేయడంతో జాతీయ స్థాయి అవార్డు కూడా పొందారన్నారని తెలిపారు. అనంతరం చెకుముకి ప్రశ్న పత్రాలు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 22 మండలాల నుంచి 27 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల నుంచి కల్లిమటం మున్సిపల్ ఉన్నత పాఠశాల రాయదుర్గం నుంచి విద్యార్థులు ఎస్.జయకృష్ణ, ఓ.చరణ్, ఎన్.భరత్, ప్రయివేట్ పాఠశాలల నుంచి లక్ష్మి సినర్జీ హైస్కూల్ అనంతపురం విద్యార్థులు, ఎన్ఎస్-ఎల్. సాయ శ్రావణి, టి.నవదీప్, కె.సాయిగణేష్, కృతిక్ ఎంపిక అయ్యారని జెవివి అధ్యక్షులు భాస్కర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ రంగన్న, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మినారాయణ, కోశాధికారి ఎం.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జగదీష్, వెంకటరామిరెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గాంగేనాయక్, ముత్యాలన్న, సహాయ కార్యదర్శి రామకృష్ణ, సాంస్కృతిక కన్వీనర్ లక్ష్మినారాయణ, మాజిక్ కన్వీనర్ ప్రసాద్, ఆడిట్ కన్వీనర్ జిలాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-బొమ్మహాల్

మాండూస్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, మిరప మొక్కజొన్న, వేరుశనగ పంటలు కోత సమయంలో పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న మధ్య తరగతి రైతులు అప్పులు చేసి పంట సాగుచేశారన్నారు. కోత సమయంలో వచ్చిన అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంటల నష్టాన్ని అధికారుల ద్వారా అంచనావేయించి రైతులను ఆదుకోవాలని కోరారు. కోతకోసిన వరి ధాన్యం నానిపోవడంతో రైతులు వాటిని ఆరబోసుకున్నారన్నారు. ప్రభుత్వమే గిటుబాటు ధరతో ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. గాలివానకు పండ్లతోటల రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



విందులో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మంత్రి పెద్దిరెడ్డికి 'అనంత' ఆత్మీయ విందు

అనంతపురం : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. ఆదివారం ఉదయం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, అనంతపురం ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, వైసీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, పాఠశాల విద్యా నియంత్రణ కమిషన్ సెక్రటరీ సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్యతో పాటు మరికొందరు ఎమ్మెల్యే అనంత స్వగృహంలో అల్పాహార విందు చేశారు. ఆ తర్వాత అనంతపురం నగరంతో పాటు జిల్లా అభివృద్ధిపై వారు చర్చించారు.

శర్మాస్‌వలి ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

దర్గాహొన్నూరు గ్రామంలోని శ్రీ శర్మాస్‌వలి ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మొదటి రోజు దీపారాదన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ముతవల్లి కమల్‌బాషా రహంతుల్లా తెలిపారు. సోమవారం రెండో దీపారాధన మంగళవారం ఉరుసు, షరీఫ్ దేవుని గుర్రపు సవారి, బుధవారం జియారత్, గురువారం పకీర్ల సభ దర్గాలో నిర్వహిస్తామని చెప్పారు. ఉరుసు సందర్భంగా స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం బళ్లారి, కనేకల్, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం బస్టాండ్ల నుంచి దర్గా హొన్నూర్ గ్రామానికి ప్రభుత్వం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు సర్పంచి శకుంతలమ్మ తెలిపారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కళ్యాణదుర్గం డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయని తెలిపారు. దీపారాదన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శ్రీదేవి, నాగరత్నమ్మ, కో-ఆప్షన్ మెంబర్ బాషా, వైసిపి నాయకులు వనల్లి రామాంజనేయులు, మనోహర్ శెట్టి, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.



పవన్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న బండారు శ్రావణిశ్రీ

పవన్‌కుమార్‌రెడ్డిని పరామర్శించిన బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన పుట్లూరు మండలం సంజీవపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మొటాటి పవన్‌కుమార్‌రెడ్డిని శింగనమల నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణి ఆయన స్వగృహానికి వెళ్లి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి తదితరులు పవన్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఖాజాహుస్సేన్

రెడ్డిపల్లి గ్రామంలో ఎస్ఐ పర్యటన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పెద్దపప్పూరు మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఎస్ఐ ఖాజా హుస్సేన్ ఆదివారం పర్యటించారు ఇటీవల గ్రామంలో మామిడి చెట్లు, చీని చెట్లు నరికి వేసిన సంఘటనపై రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మళ్లీ గ్రామంలో ఫ్యాక్షన్ భూతాన్ని ప్రేరేపించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. అలాంటి కుట్రలో పడకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలని, ప్రశాంతమైతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. పిల్లలను బాగా చదివించి వారికి మంచి భవిష్యత్తు నివ్వాలన్నారు. అలాగే ఇటీవల రైతు బాలవర్ధిరాజుకు చెందిన చీని చెట్లకు నరికేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వీలైనంత త్వరలో దోషులు ఎవరో బయటపడతారన్నారు. చాగల్లు డ్యామ్‌కు పై నుండి ఇన్ ఫ్లో ఎక్కువగా ఉండటం వల్ల దిగువకు సుమారు ఏడువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని డ్యాం అధికారులు తెలిపారు. దీంతో అశ్వర్థనారాయణ స్వామి టెంపుల్ వద్ద ఉన్న కాజేవేపై నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహించే అవకాశం ఉందన్నారు. అక్కడి కాజ్‌వేను తాత్కాలికంగా బంద్ చేస్తామన్నారు. ఎవ్వరూ కాజ్‌వే దగ్గర నదిని దాటే సాహసం చేయవద్దని, పోలీసులకు సహకరించాలని కోరారు.

19 నుంచి బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 19వ తేదీ నుంచి అనంతపురం లలిత కళాపరిషత్‌లో బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు లలితకళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల వెంకటసుబ్బయ్య, గాజుల పద్మజ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప తెలిపారు. ఆదివారం ఎల్ఎకెపిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంస్కృతిక చైతన్య ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎల్‌కెపి అధ్యక్షులు గాజుల వెంకటసుబ్బయ్య తెలియజేశారు. సమాజాన్ని మంచిదారిలో పయనింప చేయడానికి దోహదపడిన ఆనాటి ఆదర్శవంతులు, గొప్ప సంఘ సంస్కర్థలు జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ అంబేద్కర్, కందుకూరి వీరేశలింగం పంతులు, మహాకవి వేమన కళా సాంస్కృతిక నాటక రూపప్రదర్శనలను ఐద్వా, కెవిపిఎస్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, పిఎన్ఎం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాల పేరుతో లలితకళా పరిషత్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘ సంస్కర్తలు నూతన అధ్యాయానికి తెర తీసిన మహానుబావులని, వారి స్మరించుకోవడం, పునర్‌వ్యవస్థీకరణ, పనర్‌ఆలోచింపజేసే నాటకాల ద్వారా ప్రజలను చైతన్య పరిచే విధంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం గర్వించదగిన విషయం అన్నారు. నాటకం అనేది వ్యక్తుల

లలితకళాపరిషత్‌లో నృత్యరూప నాటక ప్రదర్శనలు ఎల్‌కెపి కార్యదర్శి గాజుల పద్మజ

మానసిక రుగ్మతలను రూపుమాపి చైతన్య పరిచేది అన్నారు. నాటకాలను ఆయుధంగా మలుచుకున్న సంఘ సంస్కర్తలు, దేశభక్తులు ఎందరో ఉన్నారని, వారిని స్మరించుకుని సమాజాన్ని చైతన్య పరుచుకోవడం శుభపరిణామం అన్నారు. నాటకం జగద్విదితం, వైభవం, పరిణితి, స్వభావం సమాజ చైతన్యానికి తోడ్పడుతుందన్నారు. నాటకాల ద్వారా సంఘంలో అవాంఛనీయమైన అనిర్వచనీయమైన, అసాంఘికమైన చర్యలను ఛేదించేందుకు దోహద పడతాయని తెలిపారు. ఎల్ఎకెపి కార్యదర్శి గాజుల పద్మజ మాట్లాడుతూ సంఘానికి జీవనాడులు ఎలా వచ్చాయి. పేదరిక నిర్మూలన, కుల మతాలకు అతీతంగా సంఘ సంస్కర్తలు పూలే, అంబేద్కర్, కందుకూరి, రాజారామ్మోహన్‌రాయ్ వంటి వారు తీసుకొచ్చిన విధానాలతో నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని తెలిపారు. వాటి కోసం నాడు వారి త్యాగాలు, పడిన ఇబ్బందులు, సమాజానికి కావాల్సిన సంస్కరణలను మనం స్మరించుకోవడానికి బహుజన సాంస్కృతిక చైతన్య ఉత్సవాలు దోహదపడతాయని తెలిపారు. సమస్యలు వచ్చినప్పుడు యువత ధైర్యంగా ఎదుర్కొవడానికి నాటక ప్రదర్శనలు చక్కటి అవగాహనతో



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి చేయిచేయి కలిపి మంచి మార్గం వైపు పయనిద్దామనే నినాదంతో చేపడుతున్న నాటక కళా రూప ప్రదర్శనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ సమాజాన్ని సన్మార్గంలో నడిపించిన సంఘ సంస్కర్తలు పూలే, అంబేద్కర్, కందుకూరి వీరేశలింగం పంతులు, వేమన తదితరులను మనం మరోమారు పునచ్ఛరణ చేసుకోవడానికి నాటక రూప ప్రదర్శనలు దోహదపడతాయని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ లలితకళాపరిషత్ వారి సౌజన్యంతో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారిచే నృత్యరూప నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19వ తేదీ వాల్మీకి సత్యశోధన, 20న అంబేద్కర్ సంఘం శరణం గచ్ఛామి, 21న కందుకూరి వీరేశలింగం పంతులు సంస్కరణోద్యమ ఖడ్గదారి కందుకూరి, 22న మహాకవి వేమన వినుర వేమ నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌కెపి కార్యవర్గ సభ్యులు ప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా నాయకులు నాగభూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, విజయ్, ప్రజానాట్య మండలి నాయకులు శ్రీనివాసులు, క్రిష్ణవేణి, కెవిపిఎస్ ఎర్రిస్వామి, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సికిందర్ ఆశయాలను కొనసాగిస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో పేదలు, కార్మికులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిస్తూ సిపిఎం చేసిన పోరాటాల్లో తనవంతు కృషి అందించిన సిపిఎం మాజీ నగర నాయకులు సికిందర్ ఆశయాలను కొనసాగిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. సిపిఎం మాజీ నాయకులు సికిందర్ 3వ వర్ధంతిని ఆదివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ అధ్యక్షతన నిర్వహించిన సికిందర్ వర్ధంతి కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ సికిందర్ ఎంతో క్రమ శిక్షణ కలిగిన నాయకుడు అన్నారు. ఆవాజ్ నిర్వహించిన ప్రతి పోరాటంలో పాల్గొని తనదైన పాత్ర పోషించాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మసూద్, వలి, నాయకులు ఫయాజ్, ఇస్మాయిల్, అలీ, దాదు, సిపిఎం నాయకులు ప్రకాష్, శీనా, బాబు, ప్రసాద్, బాలు, రాజు, కదిరప్ప, రామాంజి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాగభూషణం, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్యచంద్ర యాదవ్, జిల్లా కార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేదెవరు?

ప్రేక్షక పాత్రలో పోలీస్ యంత్రాంగం

ప్రజాశక్తి-కుందుర్పి

కుందుర్పి మండలంలో అసాంఘిక శక్తుల ఆటకట్టించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుందుర్పి మండల వ్యాప్తంగా కర్నాటక మద్యం ఏరులై పారుతోంది. రోజూ రూ.లక్షల్లో అక్రమంగా వ్యాపారం సాగుతోంది. పోలీసులు మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న చర్చ నడుస్తోంది. మూమూళ్లు ఇవ్వని వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారని సమాచారం. ఇటీవల మండలంలో దొంగలు పట్టపగలే చోరీలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు చేసినా చోరీ సొత్తు రికవరీ చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలో మట్కా, పేకాట యథేచ్ఛగా కొనసాగుతోంది. ఒక వేళ దాడులు జరిగినా పోలీసులు వారికి ముందే సమాచారం ఇచ్చి నిర్వాహకులు తప్పించుకునేలా చేస్తున్నారని చెబుతున్నారు. ఇటీవల పోలీసులు అడిగిన డబ్బు ఇవ్వకపోడంతో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాల్సిన పోలీసులే వాటిని ప్రోత్సహిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుందుర్పి మండలంలో అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ కృష్ణమూర్తిని ప్రజాశక్తి వివరణ కోరగా అసాంఘిక శక్తుల సమాచారాన్ని అందిస్తే కఠిన చర్యలు చేపడతామని చెప్పడం గమనార్హం.

సన్ రే హాస్పిటల్‌ను ప్రారంభించిన సజ్జల

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక బళ్లారి రోడ్డు నడిమి వంక జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన సన్ రే హాస్పిటల్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగం దినదినాభివృద్ధి చెందుతోందని అన్నారు. నగరాలలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం వల్ల జీవన ప్రమాణాలు మరింత మెరుగవుతున్నాయని తెలిపారు. అదే బాటలో సామాజిక దృక్పథం ఉన్న న్యూరో విభాగం వైద్యులు డాక్టర్ రోహిత్‌రెడ్డి ఆధునిక వసతులతో ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు.

హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు

ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించాలని ఆకాంక్షించారు. ఆస్పత్రిలోని మరికొన్ని విభాగాలను మంత్రి ఉష శ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి తదితర రాజకీయ ప్రముఖులు ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ తలారి రంగయ్య, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి,



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ గిరిజమ్మ, మేయర్ వసీం, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్‌రెడ్డితో పాటు సురేంద్రబాబు, కె.వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షులు మనోరంజన్‌రెడ్డి కార్యదర్శి అభిషేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారు 'సజ్జల'కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-ఉరవకొండ

అనంతపురానికి ఆదివారం విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు యువనేత వై.ప్రణయ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ యాదవ్ తదితరులు ఇటుకులపల్లి వద్ద ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు, కోఆప్షన్ మెంబర్ పామిడి సలీం, వైసిపి ఉరవకొండ నియోజకవర్గ నాయకులు రాజేష్, జోగి భీమన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురంలో ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని రుద్రంపేట సొసైటి ప్రెసిడెంట్ వై.జనార్ధనరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే



సజ్జలకు స్వాగతం పలుకుతున్న వై.ప్రణయ్‌రెడ్డి


తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆత్మారామిరెడ్డిలతో పాటు వెళ్లి కలిశారు. అనంతరం శాలువతో ఆయనను సత్కరించారు.

అనంతపురం : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ జి.కేశవరెడ్డి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యాన, వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రైతులకు జరిగిన ఉపయోగం గురించి చర్చించారు. ఏపీ ఆగ్రోస్ ఆర్‌బికెలను అనుసంధానం చేయాలని కోరారు. అప్పుడే రైతులకు ఉపయోగం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆత్మకూరు ఎంపిపి సుబ్బర హేమలత, వైస్ ఎంపిపి విజయకుమార్, పంపనూరు సర్పంచి ఎర్రిస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రుద్రంపేట వై.జనార్ధనరెడ్డి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న జి.కేశవరెడ్డి



సజ్జలను కలిసిన ఆత్మకూరు ఎంపిపి సుబ్బర హేమలత

నేరాలు ఘోరాలు

రైలు నుంచి జారిపడి తెనాలివాసి మృతి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో గుట్టకిందపల్లి వద్ద తెనాలికి చెందిన వ్యక్తి రైల్లోనుంచి జారి కిందకు పడి మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కరీముల్లా హుస్సేన్ (25) ఐటిఐ పూర్తి చేసుకుని గుత్తి రైల్వే స్టేషన్లో ట్రైనింగ్ కోసం వచ్చాడు. ఈ నేపథ్యంలో కరీముల్లా హుస్సేన్ పెనుకొండ కియా కంపెనీలో పనిచేస్తున్న తన తమ్ముడు వద్దకు శనివారం ఉదయం రైల్లో పెనుకొండకు వెళ్లాడు. అక్కడ తమ్ముడితో మాట్లాడి తిరిగి పెనుకొండ నుండి గుత్తికి రైల్లో బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ధర్మవరం సమీపంలోని గుట్టకిందపల్లి వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి కిందకు పడ్డాడు. ఈ ప్రమాదంలో కరీముల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకుని సంఘటనాస్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతుని జేబులో ఉన్న రేషన్, ఆధార్ కార్డులు, మొబైల్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారమందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని మల్లాపల్లి సమీపాన హిందూపురం రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు... లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన సురేష్, నాగరాజు, చౌడమ్మ, సుకన్య, భానుతేజ ఒక కారులో హిందూపురం వైపు వెళుతుండగా ఎదురుగా హైదరాబాద్ కు చెందిన మృనాత్, మరొక వ్యక్తి వస్తున్న కార్లు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని సున్నంపల్లి వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మంజునాథ్ (33) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కర్నాటక లోని టీవీ క్రాస్ కు చెందిన మంజునాథ్ శనివారం రాత్రి మహమ్మదాబాద్ క్రాస్ నుంచి ద్విచక్ర వాహనంలో సొంతగ్రామానికి బయలుదేరాడు. కదిరి హిందూపురం ప్రధాన రహదారి వంచిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ వద్ద గుర్తుతెలియని వాహనం మంజునాథ్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మంజునాథ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ, ఎఎస్ఐ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నాటువైద్యం ఘటనలో మరొకరు మృతి

ఓబుల దేవర చెరువు : సూది మందు వికటించి తుమ్మలకుంటపల్లి గ్రామానికి చెందిన పీరా అనే వ్యక్తి ఆదివారం ఉదయం మృతిచెందాడు. మోకాళ్ళ నొప్పులకు ఈనెల మూడో తేదీన అమడుగురు మండలం పూలకుంట్లపల్లి పంచాయతీలో నాటు వైద్యం సూది మందు వేయించుకున్న తుమ్మలకుంట్ల పల్లి గ్రామానికి చెందిన పీరాకు కాళ్లు వాపులు రావడంతో కదిరి ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-కనగాన పల్లి

మండల పరిధిలోని మరూర్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకకారు తమను చూసి వెనక్కుతిప్పుకుని వెళ్లారన్నారు. ఆ కారు అతివేగంగా వెళుతూ మామిళ్లపల్లి సమీపంలో ఎన్‌హెచ్ 44పై డివైడర్‌ను ఢీకొందన్నారు. దీంతో డ్రైవర్‌కారు వదిలి పారిపోయాడన్నారు. సమాచారం తెలుసుకున్న తాము సిబ్బంది తో పాటు వెళ్లి చూగా అందులో కర్నాటక మద్యం ఇరవై ఐదు బాక్సులు ఉన్నట్లు గుర్తించామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. కారు నెంబర్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టణ పారిశుద్ధ్యంపై ప్రణాళిక

ప్రజాశక్తి-రాయదుర్గం

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్), నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు సోమవారం నుండి వారాంతం వరకు ఏడు రోజులపాటు రాయదుర్గం పట్టణంలో పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ, మంగళవారాలలో బీన్ సర్వే, చెత్త సేకరణ, వేరు చేయుట గురించి ప్రజల్లో అవగాహన కల్పించుట, ఇంటింటికీ వెళ్లి కరపత్రాల పంపిణీ, యూజర్ ఛార్జీల వసూలుపై ప్రజలకు అవగాహన కల్పించుట, బుధవారం వార్డు వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, పొదుపు సంఘాల సభ్యులు సంయుక్తంగా చెత్త పై ప్రజలకు అవగాహన కల్పించుట, గురువారం పట్టణంలో ప్రజలకు చెత్తపై అవగాహన, వాటి గురించి పోటీలు నిర్వహించుట, శుక్రవారం క్లాప్ కార్యక్రమంపై అవగాహన, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రదర్శన నిర్వహించుట, సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పించడం, శనివారం పట్టణంలో చెత్తపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించుట, ఆదివారం పట్టణ పరిశుభ్రత క్లాప్‌పై ప్రతిజ్ఞ నిర్వహించుట, ప్రధాన కూడళ్లలో మానవహారం ఏర్పాటు చేయుట మొదలైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు వార్డు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ ప్రకటనలో కోరారు.

ఉరవకొండ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు విడపనకల్ ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. 2023-2024 సంవత్సరానికి సంబంధించి విడపనకల్లు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీ సచివాలయలలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, 13వ తేదీన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులకు, 14వ తేదీన మహిళా పోలీసులు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సిరికల్చర్, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు, వెలుగు సీసీలు, ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. వారికి కేటాయించిన తేదీలలో కచ్చితంగా హాజరుకావాలన్నారు. లేనిపక్షంలో శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

2022 ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధాలను సవరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉపాధ్యాయ బదిలీల్లో 2022లో ఇచ్చిన 187 జిఒలో ఉన్న అసంబద్ధాలను సవరించి ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని యుటిఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, కె.నాగేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల్లో అసంబద్ధాలను సవరించాలని, ఏ పద్ధతిలో సర్దుబాటు జరిగినా ఉపాధ్యాయులకు పాయింట్స్ కేటాయించాలన్నారు. 98 రోల్ పైన ఉన్న యుపి పాఠశాలలో కదిలిస్తున్న ఎస్‌జిటిలకు అలాగే 98 రోల్ లోపు ఉన్న కదిలిస్తున్న స్కూల్ అసిస్టెంట్స్‌కి ప్రత్యేక పాయింట్స్ కేటాయించాలన్నారు. గత బదిలీల సందర్భంగా ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలు తలసేమియా, జువైనల్, డయాబెటిస్, హార్ట్‌లో హోల్ ఉన్న వారికి ప్రధాన్యత కేటగిరిగా పరిగణించాలన్నారు. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు స్పెషల్ పాయింట్స్ కొనసాగించాలన్నారు. 92 లోపు రోల్స్ ఉన్న ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పిఇటిలకు స్పెషల్ పాయింట్స్ ఇవ్వాలన్నారు. సబ్జెక్ట్ కన్వర్షన్ అయిన వారిపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఏ ఖాళీలూ బ్లాక్ చేయరాదన్నారు. మున్సిపల్ ఉపధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి బదిలీలు వెంటనే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, ఉపాధ్యాయులు బాబు, కోశాధికారి సుధాకర్, జిల్లా కార్యదర్శులు లేహర్‌వలి, నారాయణస్వామి, శ్రీనివాసులు, రమీజాబి, హరికృష్ణ, రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ మారుతీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.